క్లుప్తంగా

రైతుల సంక్షేమానికి పటిష్ట చర్యలు

కంకిపాడు: రైతాంగ సంక్షేమానికి పటిష్ట చర్యలు తీసుకుంటామని ఏఎంసీ పాలకవర్గం తీర్మానించింది. నూతన పాలకవర్గ తొలి సమావేశం కంకిపాడులోని మార్కెట్‌యార్డులో బుధవారం నిర్వహించారు. చైర్మన్ సేనావత్తు చిన్ని అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. మార్కెట్ యార్డు ప్రాంగణంలో రైతుల సౌకర్యం కోసం మరుగుదొడ్లను నిర్మించాలని, రైతుబజారులో మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టాలని తీర్మానించారు. యార్డులో పిచ్చి మొక్కల తొలగింపు, రెండు గోదాముల రేకుల మరమ్మతులకు రూ. 28 లక్షలు నిధులు మంజూరుకావటంతో త్వరగా పనులు చేపట్టాలని తీర్మానిస్తూ, రైతు సంక్షేమ చర్యలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదు వసంత రావు, జెడ్పీటీసీ బాకీ బాబు, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థలం కబ్జా చేశారంటూ ఫిర్యాదు.. కేసు నమోదు

పెనమలూరు: పోరంకి గ్రామంలో స్థలం కబ్జా చేశారంటూ పలువురు వ్యక్తులపై వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ ఉషా రాణి తెలిపిన వివరాల ప్రకారం పోరంకి మాధవాపురం కాలనీలో విశాఖపట్నంకు చెందిన రొయ్యూరు శ్రీదేవికి ఆర్ఎస్ నంబర్ 41/1లో ప్లాట్ నంబర్ 246లో 228 చదరపు గజాలు స్థలం ఉంది. ఈ స్థలం ఆమె 2013లో ఏప్రిల్ 13వ తేదీన పటమటకు చెందిన బోయపాటి నాగలక్ష్మి వద్ద కొనుగోలు చేసి కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఈ స్థలంపై కోఆపరేటివ్ బ్యాంకులో రుణం కూడా పొందింది. స్థలం చుట్టూ కంచె నిర్మాణం ఉంది. అయితే హైదరాబాద్‌కు చెందిన నూతక్కి సాయిప్రసాద్, మరికొందరు వ్యక్తులు స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి స్థలం చుట్టూ ఉన్న సిమెంట్ స్తంభాలు ధ్వంసం చేసి గోడ నిర్మాణం చేపట్టారని బాధితురాలు శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆస్తి నష్టం కలిగించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: కానూరు మురళీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటి మెటీరియల్ నష్టం కలిగించిన వ్యక్తిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట శ్రీరామయంద్రనగర్‌కు చెందిన గాదె కాశీవిశాలాక్షి కానూరు మురళీనగర్‌లో కొత్తగా ఇల్లు నిర్మాణం చేయిస్తోంది. ఇంటి సామాను కాపలాగా వాచ్‌మెన్‌గా రమణ అనే వ్యక్తిని నెలకు రూ. 10 వేల జీతానికి పెట్టుకుంది. వాచ్‌మెన్ రమణ, అతని కుమారుడు రామకృష్ణ, కుటుంబ సభ్యులు నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద ఉంటున్నారు. అయితే వీరు ప్రతిరోజు మద్యం సేవించి అల్లరి చేయటం, ఇంటి సామాను మాయం చేయటంతో కాశీ విశాలాక్షి వాచ్‌మెన్ రమణను పని మానిపించి ఇల్లు ఖాళీ చేయించింది. కాగా మంగళవారం వాచ్‌మెన్ రమణ కుమారుడు రామకృష్ణ మద్యం తాగి వచ్చి నిర్మాణం ఇంట్లో ఉన్న 30 బస్తాల సిమెంట్ నీటితో తడిపి ఆస్తి నష్టం కలిగించాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు సాయిబాబా గుడి సమీపంలో ఉంటున్న జక్కుల మానస గత ఏడాది మే నెలలో గుడ్లవల్లేరు మండలం పెంజెంద్రకు చెందిన జక్కుల కోటేశ్వరరావును వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. అయితే భర్త కోటేశ్వరరావు, అత్త జక్కుల కుమారమ్మలు అదనపుకట్నం తీసుకురమ్మని వేధించసాగారు. కాగా ఇటీవల మానసకు కుమార్తె పుట్టడంతో వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

ఈ-క్రాప్ నమోదు ముమ్మరం



ఈ-క్రాప్ నమోదు పరిశీలిస్తున్న ఏఓ తేజశ్వి

గన్నవరం రూరల్: మండలంలో ఈ-క్రాప్ నమోదు ముమ్మరంగా జరుగుతోందని ఏఓ ఎన్.ఎల్.తేజశ్వి తెలిపారు. గ్రామాల్లో వివిధ పంటలు సాగుచేస్తున్న రైతులు అందరూ ఈ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు. బుధవారం పలు గ్రామాల్లో వీఏఏలు చేస్తున్న ఈ-క్రాప్ నమోదును ఆమె పరిశీలించారు. ఇప్పటికే నేరుగా విత్తిన వరి 7,029 ఎకరాలు, నాటిన వరి 5,644 ఎకరాల ఈ-క్రాప్ పూర్తియిందని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మొత్తం ఈ-క్రాప్ నమోదుతో సాగుదారులకు అందుతాయని చెప్పారు.

పేద కుటుంబాల్లో వెలుగురేఖలు

4 వేల కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు, సర్వీసు వైర్లు

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నున్న గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీకి త్వరలోనే విద్యుత్ కాంతులు రానున్నాయి. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా నున్న గ్రామంలోని జగనన్న కాలనీలో విజయవాడ రూరల్ మండలానికి చెందిన నున్న, పాతపాడు, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాలకు చెందిన పేదలకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడంతో పాటు ఇళ్లను నిర్మిస్తోంది. అక్కడ నివసించే ప్రజానీకానికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా ప్రభుత్వం రెండు కోట్ల 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పనులు పూర్తి చేసుకుని తుదిమెరుగులు దిద్దుకొంటోంది. నున్న గ్రామంలోని జగనన్న కాలనీలో నాలుగు లేఅవుట్లలో 8 గ్రామాలకు సంబంధించి 4,213 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలను అందజేసినట్లు గృహనిర్మాణ సంస్థ డీఈ నాగమల్లేశ్వర రావు తెలియజేశారు. వాటిలో 1,579 గృహాలు నిర్మించుకోగా 450 కుటుంబాల వారు జగనన్న కాలనీలో నివసిస్తున్నారు. ఆ కుటుంబాల వారికి ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ మీటర్లు, సర్వీసు వైర్లు, బోర్డులను సుమారు ఒక్కో ఇంటికి మూడు వేల రూపాయల విలువ చేసే వాటిని అందజేసింది. ప్రస్తుతం తాత్కాలిక ప్రాతిపదికన విద్యుత్ కనెక్షన్లు అందజేసింది. విద్యుత్ సబ్‌స్టేషన్ పూర్తి దశలో వినియోగంలోకి రాగానే శాశ్వత ప్రాతిపదికపై



నున్న జగనన్న కాలనీలో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్

విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేస్తారు. నున్న గ్రామంలోనే వీఎంసీ లేఅవుట్‌లోని 4,091 మంది లబ్ధిదారులకు కూడా ఇదే సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అందుతుంది. ఇక్కడ నుంచి సూరంపల్లి గ్రామంలోని జగనన్న కాలనీ గృహాలకు కూడా విద్యుత్ సరఫరా వెళుతుంది.

రూ.4.60 కోట్లతో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు



నున్న గ్రామంలో జగనన్న కాలనీలో రెండు కోట్ల 30 లక్షల రూపాయలు, సూరంపల్లి గ్రామంలో జగనన్న కాలనీలో రెండుకోట్ల 30లక్షల రూపాయలతో వేర్వేరుగా 33/11 కేవీ సబ్‌స్టేషన్లను ప్రభుత్వం నిర్మించింది. విద్యుత్ లైన్ల కోసం రూ.85లక్షలు ప్రభుత్వం ఖర్చు చేసింది. నాణ్యమైన విద్యుత్ సరఫరా లబ్ధిదారులకు అందుతుంది.

–డి.బాలాజీ నాయక్, డీఈఈ

రూ.3 వేల పరికరాలు ఉచితంగా ఇచ్చారు



గత నాలుగు నెలలుగా జగనన్న కాలనీలో మా కుటుంబం నివాసం ఉంటోంది. ప్రభుత్వం రూ.3 వేల విలువ చేసే విద్యుత్ మీటరు, సర్వీసు వైరు, బోర్డు ఉచితంగా అందజేసింది. మాతో పాటు ఇల్లు నిర్మించుకున్న వారందరికీ ఉచితంగా అందజేస్తున్నారు.

–షేక్ హుస్సేన్, లబ్ధిదారుడు

రూ.16 లక్షలతో గ్రంథాలయ నిర్మాణం

పెనమలూరు: వణుకూరులో గ్రంథాలయ భవనం రూ. 16 లక్షలతో నిర్మించనున్నామని జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ తెలిపారు. వణుకూరు గ్రామం జానకిరామ్ నగర్‌లో గ్రామ పంచాయతీ కేటాయించిన 4 సెంట్ల స్థలంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి జమల పూర్ణమ్మ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల ఏర్పాటుకు ముందుకు వచ్చి నిధులు మంజూరు చేస్తుందన్నారు. వణుకూరు గ్రామంలో చాలా సంవత్సరాలుగా గ్రంథాలయ భవన నిర్మాణం ప్రతిపాదన పెండింగ్‌లో ఉందన్నారు. ప్రభుత్వం నేడు నిధులు మంజూరు చేయటంతో గ్రంథాలయ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వివరించారు. జిల్లాలో స్థలాలు కేటాయిస్తే మరిన్ని గ్రంథాలయాల భవనాల నిర్మాణం చేస్తామని జిల్లా గ్రంథాలయ చైర్



వణుకూరులో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పూర్ణమ్మ

పర్సన్ జమల పూర్ణమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి గద్దల రాజా, వైఎస్సార్ సీపీ నేత చక్క గోపీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి కే.లక్ష్మయ్య, ఏఈ శ్రీనివాసరావు, వార్డు సభ్యులు సీహెచ్.దుర్గారావు,కే.శ్రీనివాసరావు, గ్రంథాలయ అధికారిణి ఎస్.భారతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో రక్షా బంధన్



పెనమలూరు: రాఖీ పౌర్ణమి సందర్భంగా పెనమలూరు సెంటర్ గ్రీన్ స్కూల్ విద్యార్థులు ఎస్ఐ రాజేష్‌ను పాఠశాలకు ఆహ్వానించి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నితనం నుంచి చక్కటి విలువలు అలవర్చుకోవాలన్నారు. రాఖీ పండుగ సందర్భంగా సోదర భావం పెరుగుతుందని వివరించారు. పాఠశాల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, శాంతి పాల్గొన్నారు.

పోరంకిలో..

కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రాఖీ పండుగను అనాథ బాలల మధ్య ఘనంగా చేసుకున్నారు. పోరంకిలో ఉన్న నవరత్న చారిటబుల్ ట్రస్టు అనాథాశ్రమంలో పిల్లలకు విద్యార్థులు రాఖీ కట్టి స్వీట్లు పంచారు.

మాతృభాషతో పాటు ఆంగ్లంపై పట్టు సాధించాలి

గన్నవరం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే మాతృభాష తెలుగుతో పాటు ఇంగ్లిష్‌పైనా పట్టు సాధించాలని వీకేఆర్ కళాశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వెంకట్ మోటపర్తి సూచించారు. మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో బుధవారం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంగ్లిష్ క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ నమూనాలను పరిశీలించి అభినందనలు తెలిపారు. అనంతరం వెంకట్ మాట్లాడుతూ.. ఈ క్లబ్ విద్యార్థుల్లో ఇంగ్లిషు ప్రావీణ్యతను పెంపొందించేందుకు ఉపయోగపడే ఒక ప్రయోగశాల వంటిదన్నారు. ఇంగ్లిషుపై పట్టు సాధించడం ద్వారా ప్రపంచంలో



ప్రాజెక్ట్ నమూనాలను పరిశీలిస్తున్న వెంకట్, ప్రసాద్

ఎక్కడైనా రాణించవచ్చని చెప్పారు. కళాశాల కార్యదర్శి జి.ఎల్.ఎస్.ఎన్.ప్రసాద్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

గంబూషియాతో దోమల నివారణ

ఉయ్యూరు: గంబూషియా చేపలతో దోమల నివారణ చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. పట్టణంలోని ఖాళీ ప్రాంతాల్లో నీరు నిలిచిన ప్రదేశాలను గుర్తించి దోమల నివారణ చర్యలను బుధవారం చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖతో కలిసి గంబూషియా చేపలను విడిచిపెట్టారు. చైర్మన్ నాని మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో 400 గంబూషియా చేప పిల్లలను వదిలామన్నారు. దోమ లార్వాను గంబూషియా చేపలు అంతం చేస్తుందన్నారు. ఫాగింగ్, ప్రత్యేక శానిటేషన్ చర్యలతో దోమలు వ్యాప్తి చెందకుండా చేశామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైద్యాధికారి డాక్టర్



నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూషియా చేపలు వదులుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

తేజస్వీని, వైస్ చైర్మన్ అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ పాల్గొన్నారు.

నున్నలో కేంద్ర బృందం పర్యటన

నున్న(విజయవాడరూరల్): కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియెట్ నుంచి వచ్చిన అధికారుల బృందం బుధవారం నున్న గ్రామంలో పర్యటించింది. గ్రామంలో అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను పరిశీలించింది. భారత దర్శనం కార్యక్రమంలో భాగంగా అసిస్టెంటు సెక్షన్ అధికారులు ఏడుగురు కేంద్రప్రభుత్వ పథకాల అమలును పరిశీలించారు. నున్న సచివాలయ-2లో అమలు జరుగుతున్న పథకాల గురించి డ్వాక్రా గ్రూపు మహిళలను అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించి వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలించారు. వారు కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని, ఆ తరువాత జల్‌జీవన్ మిషన్ నిధులతో జరిగిన అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం అమృత సరోవర్ పథకం కింద చిలకలవాని చెరువులో జరిగిన అభివృద్ధి పనులను తనిఖీచేశారు. చివరిగా జగనన్న కాలనీలో పేదల ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా నోడల్ అధికారి వి.మనోజ్ పాల్గొన్నారు.



హెల్త్ క్లినిక్‌లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కేంద్ర బృందం

వ్యాయామ విద్యకు అత్యధిక ప్రాధాన్యం

గన్నవరం: రాష్ట్రంలోనే తొలిసారిగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాయామ విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య సంయుక్త కార్యదర్శి కె.వి.రాధాకృష్ణ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఆయన ఎంఈఓ-2 ఆర్.కమలతో పాటు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నియోజకవర్గ కేంద్రాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. విద్యార్థులు క్రీడల వైపు దృష్టి సారించేలా వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న



పీఈటీలకు సూచనలు ఇస్తున్న రాధాకృష్ణ

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. హెచ్ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని, నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త ధనియాల నాగరాజు, ఉంగుటూరు, బాపులపాడు మండల కన్వీనర్ హరినారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుదారులకు ప్రభుత్వ సహాయం

గన్నవరం రూరల్: కొత్తగా డ్రాగన్ ఫ్రూట్ సాగుచేస్తున్న రైతులకు హెక్టార్‌కు రూ.50 వేల రాయితీని ప్రభుత్వం అందిస్తోందని ఉద్యాన శాఖ అధికారి ఇ.హరిచంద్ తెలిపారు. మండలంలోని చిన అవుటపల్లిలో డ్రాగన్ ఫ్రూట్ తోటలను ఆయన బుధవారం పరిశీలించారు. మొదటి సంవత్సరం రూ.30 వేలు, రెండో సంవత్సరం రూ.10 వేలు, మూడో సంవత్సరంలో రూ.10 వేలను రాయితీగా ప్రభుత్వం రైతుకు అందిస్తుందని వివరించారు. ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకుని ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలను రైతులు పొందాలని సూచించారు.



చిన అవుటపల్లిలో డ్రాగన్ ఫ్రూట్ పంట పరిశీలిస్తున్న హెచ్ఓ హరిచంద్

ఫార్మసీ కళాశాలలో సమానత్వ దినోత్సవం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో బుధవారం సమానత్వ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐపీఎస్ అధికారి షరీన్ బేగం మాట్లాడుతూ.. సమానత్వం అనేది ముఖ్యంగా మన ఇంటి నుంచే మొదలవ్వాలన్నారు. లింగ భేదం చూపకుండా, వ్యక్తిగత ఆలోచనలకు విలువ ఇవ్వాలని సూచించారు. స్త్రీ విలువ తెలుసుకున్నప్పుడే ఇంటా, బయట గౌరవం లభిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో మహిళలను గౌరవించి వారి అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐపీఎస్ అధికారి షరీన్ బేగం

దివ్యాంగ విద్యార్థినికి ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెవిటి, మూగ విద్యార్థినికి వినికిడి యంత్రం అమర్చేందుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.51 వేల ఆర్థిక సాయం చేసింది. బాపులపాడు మండలం వేలేరుకు చెందిన ఆటో డ్రైవర్ పొలగాని సురేష్ కుమార్తె ప్రమీలాజ్యోతి పుట్టుకతోనే చెవిటి, మూగ. ఇంప్లాంట్ ఆపరేషన్ ద్వారా అమర్చిన వినికిడి యంత్రాన్ని తొమ్మిదేళ్ల తర్వాత మార్చాల్సి వచ్చింది. దీని కోసం మానవత సంస్థను ప్రమీలాజ్యోతి కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. మానవత సభ్యులు కంచి వెంకటేశ్వరరావు రూ.10 వేలు, చందు మురళి రూ.10 వేలు, మరీదు వీరయ్య రూ.5 వేలు, మారుబోయిన కోటేశ్వరరావు రూ.5 వేలు, మరికొందరు సభ్యులు విరాళం కలిపి రూ.51 వేలను పొలగాని సురేష్‌కు బుధవారం అందించారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో ఈ మొత్తాన్ని సభ్యులు అందజేశారు. హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు డాక్టర్ నిడమర్తి లలితా కామేశ్వరి, కన్నికంటి సుబ్బారావు, నారగాని కొండలరావు, దయాల ప్రభాకరరావు, గంటా సత్యనారాయణ పాల్గొన్నారు.

156 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా 156 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. సెప్టెంబర్ నుంచి 8,010 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు బుధవారం తెలిపారు. ప్రస్తుతం మండలంలో 7,854 పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారు. కొత్త పింఛన్లతో 8,010 మందికి రూ.2.16 కోట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. కొత్త పింఛన్లను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేస్తామని తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: జిల్లాలో లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి తెలిపారు. బాపులపాడులోని స్కానింగ్ కేంద్రాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా ప్రభుత్వ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా పీసీపీఎన్డీటీ చట్టం పరధిలో నమోదు కావాలని ఆదేశించారు. ఏ స్కానింగ్ కేంద్రంలోనైనా గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్ష నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే ఐఎంఏ గుర్తింపు సైతం రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తామని తేల్చిచెప్పారు. జిల్లాలో తక్కువ లింగ నిష్పత్తి కలిగిన ప్రాంతాలను గుర్తించి, ఆ ఏరియాలోని స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాల వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయానికి తెలిపాలని కోరారు. సమాచారం అందిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఆరోగ్య విద్య బోధకుడు బి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ గీతాబాయి

మహిళా చిరువ్యాపారులకు జగనన్న తోడు

నున్న(విజయవాడరూరల్): డ్వాక్రా గ్రూపుల్లోని మహిళా చిరు వ్యాపారులు ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.10 వేల రుణం అందజేస్తోందని సెర్ప్ అసిస్టెంటు ప్రాజెక్ట్ మేనేజర్ గంధం చంద్రశేఖర్ తెలిపారు. నున్న గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కార్తీక్‌ను డ్వాక్రా గ్రూపు మహిళలతో కలిసి రుణాలు మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మండలంలో డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉండి, చిరువ్యాపారాలు చేసుకొనే 1,560 మంది మహిళలకు ఏడో సారి రుణాలు మంజూరుచేయాలన్నది లక్ష్యమని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తామని, వాయిదాల్లో బాకీ తీర్చిన వారి తరఫున ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుందని వివరించారు. స్త్రీ నిధి కింద రుణాలు పొందిన మహిళలు వాయిదా చెల్లింపులను ఫోన్ పే, పేటీఎం ద్వారా చెల్లించే సదుపాయం ఉందని ఏపీఎం తెలిపారు.



నున్న బ్యాంక్ మేనేజర్‌కు దరఖాస్తులు అందజేస్తున్న ఏపీఎం చంద్రశేఖర్

గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేను వేగవంతం చేయాలి

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విద్యాశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ.. మండలంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించాలని సూచించారు. ఆ విద్యార్థులను వారు నివసించే ప్రాంతంలోని పాఠశాలల్లో చేర్చాలని పేర్కొన్నారు. ఎంపీపీ అనగాని రవి, ఎంపీడీఓ సత్యకుమార్, ఎంఈఓ-1 రామ్ బాల్‌సింగ్, ఎంఈఓ-2 ఆర్.కమల, పలువురు ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ తాహెరా సుల్తానా

ఎడ్యుకేషన్ సర్వే సక్రమంగా చేయాలి

డీఎల్‌డీఓ ఏఎల్‌వీ నాంచారావు

పెనమలూరు: వలంటీర్‌లు ఎడ్యుకేషన్ సర్వే సక్రమంగా చేసి వివరాలు నమోదు చేయాలని డీఎల్‌డీఓ ఏఎల్‌వీ నాంచారావు అన్నారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధి పోరంకి-3 సచివాలయంలో వలంటీర్లకు వలంటీర్‌ల ఎడ్యుకేషన్ సర్వేపై సమీక్ష నిర్వహించారు. సచివాలయాల పరిధిలో వలంటీర్‌లకు మ్యాప్ చేసిన ఇళ్లలో 5–18 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లల వివరాలు సీఆర్ యాప్‌లో నమోదు చేసి ఉన్నాయన్నారు. ఈ వివరాల ఆధారంగా ఎంత మంది పిల్లలు చదువుతుంది, ఎంత మంది చదువు మానింది వివరాలు సేకరించాలని సూచించారు. వలంటీర్లు ప్రతి ఇంటిని విధిగా సర్వే చేయాలన్నారు. వంద శాతం స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) పూర్తి చేయాలని అన్నారు. సర్వే సమయంలో సమస్యలు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.ప్రకాశరావు, అసిస్టెంట్ కమిషనర్ అభినేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.